# లోహియా పరిచిన వసంతం చిగురించేనా

ఏ దేశమైనా ఒక గొప్ప తాత్వికున్ని కోల్పోతె ఒక కన్ను కోల్పోయినంత లోటు . కానీ తాత్వికుడైన రాజకీయ నాయకుడిని కోల్పోతె మరింత లోటు . కానీ అతను తాత్విక రాజకీయనాయకుడయీ , కళా, కవీ హృదయుడయీ కర్మయోగి కూడా అయితే ఇక ఆ దేశానికి అట్లాంటి మనిషిని తిరిగి పొందడానికి సాపేక్షంగానైనా ఎంత కాలం పడుతుందో . అలా ఈ దేశం కోల్పోయిన మహానుభావుల్లో రామమనోహర్ లోహియా ఒకరు . ఈ దేశంలో సిద్ధాంతాలు సృష్టించడానికిగానీ , పుస్తకాల సమాచారం మెదడులో నింపుకుని ఘర్షణలు సృష్టించేవారు కానీ వేలల్లో వున్నారు . అయితే విశ్వమంత హృదయంతో చెప్పిందే ఆచరించేవారు , తప్పులను సరిదిద్దుకుంటూ అందరిని కలుపుకుని పోయి నూతన శక్తిని సమకూర్చుకుని విశ్వశాంతికి పరికరంగా మారేవారు అతి తక్కువ మంది వున్నారు . ఉన్నవారూ ఒక్కొక్కరుగా రాలిపోతున్నారు . అయితే ఆశ ఏంటంటే రాలిపోయిన ఆ మరణ ఋతువులోంచి ఆశల్ని చిగురింపజేసే వారి జీవిత నడక అనే వసంతాలను పరిచిపోయారు . అందులోంచి పొడుచుకోచ్చే సామాజిక చిగుర్ల గురించి ఎక్కడో వుండి ఎదురుచూస్తుంటారు .

అట్లాంటి వారిలో లోహియా అగ్రగణ్యుడు . సామాజిక అన్యాయాలు తరాలుగా పాదుకుని ఉన్న ఈ దేశంలో తాను చేయాల్సినదంతా చేసి వెళ్ళిపోయాడు . మిగితా తరాలకు దారి చూపించి వెళ్ళిపోయాడు . పుట్టింది అగ్రవర్ణమైన వైశ్య కులంలోనైనా , కలవరించి తపించింది మాత్రం వేల సంవత్సరాలుగా సామాజిక అన్యాయం జాతుల గురించి మాత్రమె . ఆ జాతుల్లో అందరూ వున్నారు . ఆయనకు చెందనిదీ అంటూ ఏదీ లేదు .

భారతీయ జీవితంలో అన్నిటికన్నా వినాశనకరమైంది కులం . తరతరాలుగా సామాజిక అన్యాయం పొందిన జాతుల వృద్ధి గురించి మొక్కకు ఎరువులాగా ఉపయోగపడండీ అని అగ్రవర్ణాలకూ పిలుపునిచ్చాడు . అధికారాన్ని అందుకునే క్రమంలో శూద్రులకు , హరిజనులకు , మహిళలకు , ముస్లిములకు వారి వారి యోగ్యతలను మించిన ప్రాతినిధ్యం ఇవ్వాలి అన్నాడు . లోహియా కూడా అట్లాగే జీవించాడు . 1960 ల్లో

లోక్ సభలో తమ సోషియలిస్ట్ పార్టీ లీడర్ గా అన్ని అర్హతులున్నా తానో , మధులిమాయేనో కాకుండా బీ.సీ తరగతికి చెందిన రబీరేనూ అట్లాగే రాజ్యసభలో కాబట్టి రాజ్ నారాయణన్ ని కాకుండా పెరిక కులానికి చెందిన మురహరి అనే తెలుగు వ్యక్తిని నియమించాడు . అట్లాగే కింది వర్గాలు అధికారంలోకి వచ్చిన తారువాత అగ్ర వర్ణాలను ద్వేషించకుండా కలుపుకపోవాలి , ఎందుకంటే వారిలోనూ అన్నీ పోగొట్టుకుని నిరుపేదలుగా వున్న వారున్నారన్న విషయాన్ని మరువరాదనీ , కటుత్వం , ద్వేషం వల్ల అధమత్వానికి శాశ్వతంగా పట్టం కట్టినట్లు అవుతుందని జాగ్రత్తలు చెప్పాడు . ఆలోచనాస్థాయిలో ద్రౌపతి ఏనాడుకూడా పురుషునితో ఓటమిని అంగీకరించలేదు కాబట్టి భారత స్త్రీలు ఆమెను ఆదర్శంగా తీసుకొని ధైర్యంగా పోరాడలన్నారు . స్త్రీలను గుడ్డమూటలా తయారు చేయకూడదు , అవసరం వచ్చినపుడు పురుషుణ్ణి మూటకట్టుకుని తన వెంట తీసుకొని వెళ్ళగల శక్తివంతురాలిగా స్త్రీని రూపొందించాలి అన్నాడు . ఎంతటి నిరుపేదలైనప్పటికీ ఉన్నదాంట్లో త్రుప్తిపడుతూ తమ సహజమైన ఆనందాన్ని కొనసాగిస్తున్న ఆదివాసుల నుండి మిగితా భారతదేశ ప్రజలు ఆ ఆనందం ఎట్లా పొందాలో నేర్చుకోవలిసి వుంటుందన్నాడు .

ఇలా అందరిని కలుపుకొని , అందరినుండి నేర్చుకోవాలనుకున్నాడు . మార్క్స్ నుండి గాంధీ వరకు నేర్చుకునేది ఎంతో వుంది అయితే నేర్చుకోవడం అనేది నీవు ఇంకొకరి ప్రభావ చట్రంలో ఉండకుండా ఉన్నపుడే సాధ్యపడుతుంది అని అన్న లోహియాలో నిర్మల సత్యాన్వేషిని చూడొచ్చు . అందుకనే అతను గాంధీకి దగ్గరయాడు , అంబేద్కరుకూ దగ్గరయ్యాడు . నిత్యనదీ ప్రవహామై స్వచ్ఛంగా ప్రవహించాడు . ప్రవహామంతా మెరుపులు కురిపించాడు .

లోహియా హృదయాన్ని ఎక్కడ పట్టుకోవచ్చంటే మంత్రివర్గంలోకి రమ్మని నెహ్రూ సోషలిస్టులను ఆహ్వానిస్తే ప్రజల తరుపున పోరాడే ప్రతిపక్షంలో వుంటాము కానీ మంత్రి వర్గంలో చేరమూ అని తిరస్కరించిన అతని పీడిత ప్రజల పక్షపాతంలోనూ చూడొచ్చు . దేశంలో వ్యక్తుల కనిష్ట , గరిష్ట ఆదాయాల మధ్య వ్యత్యాసాన్ని కనీసం 1:10 కుదిద్దామని లేదంటే ప్రమాదమని తలచిన అతని కలలలోనూ ; ఎంతసేపూ ధనికులైన టాటా బిర్లాల గురించే పెయింటింగ్ వేస్తావా అని ఏం.ఎఫ్ .హుస్సేన్ ని హిందూ పురాణాలైన రామాయణ ,

భారతాలు నేర్చుకునేట్లు చేసి గ్రామీణ ప్రజల దగ్గరికి వెళ్ళేట్లు చేసిన అతని పల్లె ప్రేమలోనూ ; తాను దేవుణ్ణి నమ్ముతాను అని ఎక్కడా చెప్పకపోయినా ప్రజాల ఇష్టాలను గౌరవించాలని చెప్పిన అతని ప్రజాస్వామిక దృక్పథంలోనూ ; భారతీయ పురాణాలు , శిల్పం , చిత్రకళలను కొత్త కోణంలో చూసిన అతని కళా దృక్పథంలోనూ ; ఒంగోలు పర్యటనకు వచ్చినపుడు ఇతరులను ఇబంది పెట్టడం ఇష్టంలేక రైల్వే ప్లాట్ ఫాం మీద పడుకున్నపుడుగానీ ; సోషలిస్ట్ మహాసభల్లో తన ప్రసంగం పూర్తి కాగానే చివ్వర్లో ఉండే శ్రోతల వరుసల్లోకి వచ్చి సాధారణ ప్రజానీకంతో సరదా కబుర్ల ద్వారా వారి జీవితాల్లో పడుతున్న ఇబ్బందుల గురించి తెలుసుకోవాలనుకున్నపుడు గానీ ; ఏ ప్రలోభం పెట్టకుండా కేవలం తన సిద్ధంత ఆచరణ , ప్రేమ ద్వారే కేశవరావ్ జాదవ్ , రావెల సోమయ్య లాంటి అంకితమైన సోషలిస్ట్ లను వేలాది మందిని దేశ వ్యాప్తంగా సంపాదించుకోవడంలోనూ ; అమెరికా పర్యటనలో వున్నపుడు తాను ప్రయాణిస్తున్న టాక్సీ డ్రైవరు ద్వారా అక్కడి ప్రభుత్వం గురించి వారేమనుకుంటునారో తెలుసుకోవడం లాంటి సంఘటనలల్లో , ఐన్ స్టైయిన్ లాంటి శాస్త్రవేత్తను కలుసుకుని అతను కనుక్కున్న అణుబాంబు సంఘటనను నిర్మోహమాటంగా విమర్శించి మానవ ఆలోచన విముక్తమై కొత్త పుంతలు తొక్కడానికి నూతన సమన్వయం ఏదైనా సాధ్యపడుతుందా అనే గొప్ప మానవ స్వేచ్ఛా జిజ్ఞాసను ఐన్ స్టైయిన్ తో వ్యక్తపరచడంలోనూ చూడొచ్చు ; శ్రీమంతులను పిలిచినట్లుగా రిక్షా కార్మికున్ని కూడా ‘‘ మీరు అని పిలిచే లోహియా సమత్వ భావనలోనూ , మార్చ్ 23 న రోజున భగత్సింగ్ సుఖదేవ్ , రాజగురులు అమరులయ్యారు కాబట్టి వీరిని తలచుకుందాం కానీ తన జన్మదినాన్ని ఉత్సవం చేసుకోడానికి విముఖత చూపినపుడూ , అట్లాగే గ్రామీణ ప్రజలతో ముఖ్యంగా రైతులతో , వృత్తి కులాల వాళ్ళతో మమేకం వల్లే వారి సమస్యల్ని బాగా అర్థం చేసుకోగలుగుతామననే లోహియా సహజ స్వభావంలో , జీవితమంతా దేశమే తన కుటుంబమని పెళ్ళీ , ఆస్తీ లేకుండా లోకప్రేమను భస్మముగా వొంటికి పూసుకొని తిరిగిన బైరాగి జీవితంలోనూ లోహియా హృదయం చిరునామాను పట్టుకోవచ్చు .

‘‘ప్రతిష్టా – సంపదలు సర్వసాధారంగా కలిసి మెలిసి పయనిస్తూ ఉన్నప్పటికీ , కొన్ని సందర్భాలలో కలిసి పయనించవు . ఒకే సమాజంలో బ్రతికే వ్యక్తులందరూ , ఒకేరకంగా వుండరు . సంపద మొదలైనవి చలిస్తూ , తగ్గుతూ , హెచ్చుతూ వుంటాయి . వర్గంలోని వారందరూ కూడా హెచ్చుతూ తగ్గుతూ వుంటారు . అంటే

వర్గం చలాయమానం అవుతూ ఉంటుంది . అందుకు భిన్నంగా కులంలో ఆదాయం , ప్రతిష్టాస్థాయి నిలకడగా వుంటాయి . చలనం ఉండదు . వర్గాలలో పరివర్తనమూ , సంఘర్షణా కొనసాగుతూ ఉంటాయి . కులం చలాయమానమైనపుడు వర్గంగానూ , వర్గం జడమైపోయినపుడు కులంగానూ పరిణమిస్తాయి . భారతదేశంలో ఉన్నటువంటి జడమయమైన కులతత్వం ప్రపంచమంతా కొనసాగింది . అయితే ఇక్కడది గంభీరమైన రూపం ధరించి బిగుసుకుపోయింది . మిగితా దేశాల్లో కదులుతూ , కరుగుతూ కొనసాగుతుంది అనే అద్భుతమైన తాత్విక అవగాహన వుంది కాబట్టే భారతదేశంలో అనేక జాతులుగా వున్న కుల సమస్యను పరిష్కరించకుండా సోషలిజాన్ని సాధించలేమన్న నిర్ణయానికి వచ్చాడు . అందుకనే సామాజిక న్యాయం సాధించే ఉత్తర భారతదేశంలో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడడానికి పునాది అయ్యాడు . లోహియా సిద్ధాంతాల ద్వారా ఆయన చెప్పిన ఈ సామాజిక సమస్యలను రూపు మాపగలిగామా , లోహియా చింతనలో కూడా పరిమితులు ఉన్నాయా అనే విషయంలో భిన్న అభిప్రాయాలు ఉంటే ఉండొచ్చు గాక , కానీ లోహియా స్వచ్చమైన మేధస్సును , ఆచరణను శంకించలేము .

‘‘ వెనుకబడిన తరగతుల వారు తమ చేతికి అధికారం వచ్చిన వెంటనే ఉన్నత కులాలవారి అలవాట్లను , దుర్గుణాలను అనుకరించాలన్న కోర్కెను అరికట్టుకోవాలి ‘‘ అని లోహియా పిలుపునిచ్చాడు . సామాజిక న్యాయం పొందుతున్న అన్ని కులాల నాయకులు తాము ఒకసారి అనుభవించిన ఫలాలతో సరిపెట్టుకుని తమలో అనుభవించని మిగితా వారికి అవకాశం ఇస్తేనే లోహియా భావించిన సామాజిక న్యాయం అనే మాటకు న్యాయం జరిగినట్లు అవుతుంది . లేదంటే ఇక్కడ కూడా అధికార కేంద్రీకరణ జరిగి దీంట్లోనూ ఒక రకమైన తక్కువా ఎక్కువా కులాలు ఏర్పడుతాయి . సామాజిక న్యాయం పేరుతో అవకాశాలు పొందుతున్న ఓ తండ్రి , తరువాత అతని కొడుకులు, వారి బంధువులే ఎం. ఎల్ .ఏ లు , మంత్రులు అవుతారు కానీ అంతకంటే తక్కువ స్థాయి కలిగిన మిగితా వారికి అవకాశం ఇవ్వరు . ఇట్లాంటి తాబెదార్లను మోసే స్వార్థపూరిత మేధావులూ వుంటారు . ఇట్లాంటి వాళ్ళను నమ్మొద్దు . అవకాశం ఉన్న ప్రతిచోటా న్యాయం జరగకుండా ఎన్ని సభలు , సమావేశాలు పెట్టినా పెద్దగా ఉపయోగం లేదు .

నగ్నంగా చూసుకుంటే ఈ కాలంలో  కమ్యూనిస్ట్ కమ్యూనిస్టుగా లేడు .  గాంధీ పేరు చెప్పుకునే పార్టీవారు గాంధేయులుగా లేరు . లెఫ్టిస్ట్ అనేవాడు లెఫ్టిస్ట్ గా లేడు . ఒకరు ఇంకొకరితో ఏకం కారు .  కాలం మహిమనా ? లేదా సిద్ధాంతాలను పునర్ నిర్వచించుకోవాల్సిన అవసరమా ?  మనిషనే పదార్థమే స్వార్థపూరితంగా ఉందా ?  నిజాయితిగా కనుక్కోవాలి . వ్యక్త్యి  తన స్వార్థాన్నుండి విముక్తి కాకుండా , స్వార్థాన్ని అనుక్షణం కడుక్కోకుండా  సమాజాన్ని ఉద్ధరిద్దాము అనే  ప్రయత్నం చేయడమంటే  అంటే తనలో దాగివున్న అహం ఆడే నాటకానికి లొంగిపోవడమే అవుతుంది . సమస్య పరిష్కరింపబడకుండా అక్కడక్కడే ఒక వలయం నుండి ఇంకో వలయంలోకి తిరుగుతుంది కానీ పెద్దగ ఒరిగేదేమీ లేదు  . సెపాన్ని శత్రువు అనే పేరుతొ లేని వాణ్ని తయారు చేసుకుని వాడి మీద రుద్దాలని చూస్తుంది . అనుక్షణం ఆత్మవిమర్శ లేకపోతే వాస్తవాన్నుండి పారిపోవడమే అవుతుంది . అందుకే చెప్పిందే ఆచరించే మనుష్యుల కోసం లోహియా ఓ వసంతాన్ని పరిచాడు . ఆ వసంతం చిగురిస్తుందా ? , మోడుబారుతుందా ?  చూడాలి .

( రామ్మనోహార్ లోహియా జన్మదిన నివాళి )

మోతె గంగారెడ్డి

( లండన్ లోని బెడ్ ఫోర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి )

9000022443

.